

సింగరేణి డైరెక్టర్ (పా)గా పోట్రు గౌతమ్



రుద్రంపూర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ డైరెక్టర్(పా)గా పోట్రు గౌతమ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం మేడ్చల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్‌ను గురువారం చేసిన బదిలీల్లో సింగరేణి డైరెక్టర్ (పా)గా నియమించింది. గౌతమ్ రెండేళ్ల క్రితం భద్రాచలం ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహించారు. ఇదిలా ఉంటే గత పదేళ్లుగా సింగరేణిలో డైరెక్టర్ (పా)గా ఐఏఎస్ అధికారి లేరు. గౌతమ్‌ను నియమించటంతో కార్మికులు, సింగరేణి అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సహజ సాగుకు.. సమాయత్తం



- ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా
- సేంద్రియ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులకు ప్రోత్సాహం
- 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి శ్రీకారం
- ఖమ్మం జిల్లాలో 1,875 మంది రైతుల ఎంపిక
- భద్రాద్రి జిల్లాలో కొనసాగుతున్న ఎంపిక ప్రక్రియ

ఖమ్మం వ్యవసాయం/కొత్తగూడెం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వ్యవసాయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పునరుద్ధరించడం, వ్యవసాయాయన్ని లాభసాటిగా మార్చి పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ప్రకృతి వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సహజ పద్ధతుల్లో విభిన్న పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి శ్రీకారం చుట్టింది. మూసపద్ధతిలో సాగుకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించే పంటలకు ప్రాధాన్యమివ్వనుంది. ఈ పథకానికి కేంద్రం ప్రభుత్వం 60శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం ఖర్చు చేయనున్నాయి. 2025-26 సంవత్సరంలో 60వేల ఎకరాల్లో ఈ పథకం కింద సాగు చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్క క్లస్టర్‌లో 125ఎకరాలు చొప్పున ప్రకృతి సాగు చేపటనున్నారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో 15 క్లస్టర్లలో 15గ్రామాలను ఎంపిక చేసింది. ఆయా గ్రామాల్లో మొత్తం జిల్లా మొత్తంలో అన్ని క్లస్టర్లనుంచి 1,875 మందిని ఎంపిక చేశారు. వారికి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 15 క్లస్టర్ల పరిధిలో రైతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం 350మంది రైతులను గుర్తించారు.

సహజ వ్యవసాయ మిషన్ విశేషాలు..

సురక్షితమైన పోషకాహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సహజ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తుంది. 2025-26లో ఈ పథకం కోసం వెచ్చించే (మిగతా 4వ పేజీలో)



దురిశెట్టి అనుదీప్



ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బదిలీ

- కొత్త పాలనాధికారిగా అనుదీప్ దురిశెట్టి
- సామాన్యుడిగా వచ్చి సేవలందించిన ముజమ్మిల్
- ఏడాది తిరక్కుండానే స్థానచలనం

ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆయన ఓ ఐపీఎస్ అధికారి కుమారుడు.. ఐఏఎస్ సాధించి ఖమ్మం కలెక్టర్‌గా ఓ సామాన్యుడిలా వచ్చి ప్రజలకు సేవలందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బదిలీ అయ్యారు. ఏడాది తిరక్కుండానే ఆయన్ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నియమించారు. ఆయన స్థానంలో ప్రస్తుతం హైదరాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనుదీప్ దురిశెట్టిని నియమించారు. గతంలో అనుదీప్ భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా మూడేళ్ల పాటు విజయవంతంగా విధులు నిర్వహించారు. ఆయనకు ఖమ్మం జిల్లాపై అవగాహన ఉండడంతో కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్‌ఖాన్ గతేడాది (మిగతా 4వ పేజీలో)

గతంలో భద్రాద్రి.. ఇప్పుడు ఖమ్మం

2017 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన అనుదీప్ దురిశెట్టికి ఉమ్మడి జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. గతంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా పని చేసిన సందర్భంలో ఖమ్మం జిల్లాలో జరిగిన పలు సమీక్షలకు హాజరయ్యేవారు. ఈ క్రమంలో ఈ జిల్లా స్థితిగతులు, రాజకీయ పరిస్థితులు, సమస్యలపైనా అవగాహన పెంచుకున్నారు. పరిపాలనలో పకడ్బందీగా వ్యవహరిస్తారన్న పేరున్న అనుదీప్ కొత్తగూడెం జిల్లాలో మూడేళ్ల పాటు పనిచేసిన సమయంలో గోదావరి వరదలు, కరోనా విపత్కర సమయంలో పనితీరు ప్రశంసనీయంగా మారింది. కరీంనగర్ జిల్లా మెట్‌పల్లికి చెందిన అనుదీప్ 2017సివిల్స్‌లో ఆలిండియా 1వర్యాంకు సాధించాడు. బీటెక్ ఎలక్ట్రానిక్స్ ఇన్స్ట్రుమెంట్ చదివారు. యువ ఐఏఎస్ అధికారిగా కొత్తగూడెంలోనే శిక్షణ పొంది అక్కడే కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. 2018లో జాయింట్ కలెక్టర్‌గా, 2021లో కలెక్టర్‌గా పనిచేశారు. 2023లో హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యి తాజా బదిలీల్లో ఖమ్మం కలెక్టర్‌గా వస్తున్నారు. బిట్స్‌పిలానీలో ఎలక్ట్రానిక్స్, ఇన్స్ట్రుమెంటేషన్ డిగ్రీ పుచ్చుకున్న అనుదీప్ గూగుల్‌లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా, ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్‌గా (కస్టమ్స్, పరోక్ష పన్నుల విభాగంలో) పనిచేశారు.

'ఇందిరమ్మ ఇళ్ల'లో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం

- మొదటి విడతలోనే ఇచ్చేలా కార్యాచరణ
- అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడొద్దు
- ప్రజల భాగస్వామ్యంతోనే ఖమ్మం పరిశుభ్రం, పచ్చదనం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 5వ డివిజన్‌లో రూ.50లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యం ఉంటుందని, మొదటి విడతలోనే ఆయా కుటుంబాలకు ఇళ్లు ఇచ్చేలా కార్యాచరణ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని 5వ డివిజన్ ఖానాపురంలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో ఖమ్మం అభివృద్ధిని అంచనాలు వేసి వైఎస్ఆర్ నగర్, బైపాస్ రోడ్డు నిర్మాణాలు చేశామని ఆ సమయంలో ఇక్కడ నిర్మాణాలు ఎందుకని ప్రశ్నించారని ఇప్పుడు ఆ ప్రాంతానికి డిమాండ్ పెరిగిందని గుర్తు చేశారు. ఖమ్మంలో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో రాజీపడొద్దని, జీవితకాలం గుర్తుండిపోయే భవిష్యత్ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, పచ్చనైన ఖమ్మంగా ఖ్యాతి పొం దిందని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు మారుతూ ఉంటారని, ప్రజలు మాత్రం స్థానికంగా ఉంటారని అందుకే పరిశుభ్రత సామాజిక బాధ్యతగా ఉండాలన్నా రు. ఖమ్మంలో పెరుగుతున్న జనాభాకు తగిన స్థాయిలో మౌలిక సౌకర్యాలను పెంచుతున్నామన్నారు. వచ్చే ఏడాది వరకు ఖమ్మం నగర అభివృద్ధికి మరో రూ.300 కోట్లు వరకు తెప్పిస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ 5వ డివిజన్‌కు గతంలోని రూ.1కోటి నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశా రు. సీసీ రహదారులపై ర్యాంపులు నిర్మించొద్దన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నగరంలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వరదనీటి కాలువ, రోడ్ల విస్తరణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వరద కాలువ విస్తరణ పనులు సీఆర్బీ టవర్స్ నుంచి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. లకారం చెరువు అల్లీపురం రోడ్డు గంగమ్మతల్లి టెంపుల్ వద్ద కాలువ పనులను తనిఖీ చేశారు. గంగమ్మతల్లి దేవాలయం వద్ద కాలువ ఆక్రమణకు గురైందన్న ఆరోపణలపై మంత్రి స్పందించి తక్షణమే ఆక్రమణలను తొలగించాలన్నారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి రోడ్ల పక్కన దుకాణాలు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపించాలని సూచించారు. మంత్రి పర్యటనలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ హన్మంతరావు, ఆర్డీవో నర్సింహారావు, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సకాలంలో యూనిఫాం

- మహిళా శక్తి చాటిన స్వయం సహాయక సంఘాలు
- డీఆర్డీఏ ఆధ్వర్యంలో 56 వేలు, మెప్మా ఆధ్వర్యంలో 15,818 యూనిఫాంల తయారీ
- మొదటి జత స్టిచ్చింగ్ నూరుశాతం పూర్తి
- జూలై 20 వరకు రెండో జత అందజేసేందుకు ఏర్పాట్లు

4

ఉమ్మడి జిల్లా ఇన్‌-చార్జ్ మంత్రిగా వాకిటి శ్రీహరి

కరీంనగర్‌కు మంత్రి తుమ్మల.. వరంగల్‌లోనే పొంగులేటి



ఖమ్మం, జూన్ 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జ్ మంత్రులకు స్థానచలనం కల్పించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గా ఇటీవలి మంత్రి వర్గ విస్తరణలో పదవి దక్కించుకుని.. పశుసంవర్థకం, యువజన క్రీడల శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వాకిటి శ్రీహరి నియమితులయ్యారు. శ్రీహరి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎక్కడా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు ఇవ్వలేదు. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా కొనసాగుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అదే జిల్లాకు ఇన్‌చార్జ్‌గా ఉంచారు. ఇదిలా ఉంటే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా ఉన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఖమ్మం జిల్లాలో చాలా తక్కువసార్లు పర్యటించారు. ఇక్కడ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులుగా పొంగులేటి, తుమ్మల ఉండడంతో వారికే ఎక్కువగా బాధ్యతలు ఇచ్చారు. సమీక్షల్లోనూ ముగ్గురు మంత్రులకే అధిక ప్రాధాన్యం కల్పించారు.





'గూడెం' ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యం

- తాత్కాలిక షెడ్లలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- వర్షాకాలంపై ఆందోళన



4

'పీఎం ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'పై అవగాహన సదస్సులు

- ఖమ్మం జిల్లాలో 35 గిరిజన ఆవాసాల ఎంపిక
- ఈనెల15 నుంచి 30 వరకు సదస్సులు: కలెక్టర్



మోగిన బడిగంట

- వేసవి సెలవుల తర్వాత పునఃప్రారంభమైన స్కూళ్లు
- ఖమ్మం జిల్లాలో తొలిరోజు 48 శాతమే హాజరు
- ఎండల తీవ్రతతో తగ్గిన హాజరు శాతం
- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు, యూనిఫాం



ఖమ్మం ఎస్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



ఖమ్మం ఖానాపురంహవేలి / కొత్తగూడెం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు ముగియడంతో గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బడిగంట మోగింది. కొన్ని పాఠశాలల్లో మామిడి ఆకులతో తోరణాలు కట్టి విద్యార్థులను ఆహ్వానించారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కేవలం 48శాతం మంది విద్యార్థులే హజరయ్యారు. జిల్లాలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు 54,225 ఎన్‌రోల్‌కాగా 26,033 మంది మాత్రమే తొలిరోజు హజరయ్యారు. తల్లాడ మండలంలో అత్యధికంగా 68 శాతం హజరు నమోదైంది. అతి తక్కువగా ఖమ్మం అర్బన్ మండలంలో 37శాతం మంది విద్యార్థులు హజరయ్యారు. ఎండల తీవ్రత దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించలేదని తెలుస్తోంది. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పూర్తిస్థాయి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఎక్కువ శాతం మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదు. వేసవిలో పలు పాఠశాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాకపోవటంతో మొదటి రోజు విద్యార్థులు ఉపాధ్యాయులు కొంత ఇబ్బంది పడ్డారు.

విలువలు కలిగిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే..

పాఠశాలల పునఃప్రారంభం రోజు ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి కె. సత్యనారాయణ ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. విలువలు కలిగిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే (మిగతా 4వ పేజీలో)

ఒక్కరి నుంచి.. పదిమంది..

'బ్రాండ్ అంబాసిడర్' కీర్తన స్ఫూర్తితో పెరిగిన విద్యార్థుల సంఖ్య

నారపనేనిపల్లి పాఠశాలలో తొమ్మిది మంది చేరిక



పాఠశాల గోడపై కీర్తన చిత్రం

విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఎంఈవో

4

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యం

- తాత్కాలిక షెడ్లలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- వర్షాకాలంలో పరిస్థితిపై ఆందోళన



కొత్తగూడెం టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం నిర్వహించడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. నిర్మాణ పనులకు కోట్లాది రూపాయలు కేటాయించినా.. పనులు ముందుకు సాగని పరిస్థితి జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో నెలకొంది. దీంతో తాత్కాలిక షెడ్లలోనే రైతులు కూరగాయలు, ఆకుకూరలను విక్రయిస్తున్నారు.

కొత్తగూడెం పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కోసం ఆనాటి ప్రభుత్వం రూ.4.50లక్షలను కేటాయించింది. ఆనాటి మునిసిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చేతుల మీదుగా 2002 మార్చి 3న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పబ్లిక్ హెడ్ మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టారు. నాలుగేళ్లు గడుస్తున్నా.. నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగుడం లేదు. అభివృద్ధి పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ముందుకు సాగని పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోనే నిర్మాణ పనులు సంవత్సరాల తరబడి సాగడం పట్ల ప్రజలు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రచారం చేస్తున్న పాలకులు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో కొత్తగూడెం, సుజాతనగర్, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి తదితర మండలాలకు చెందిన సుమారు 100 మందికి పైగా రైతులు తాత్కాలిక షెడ్లలో వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో తమ కూరగాయలను ఈ మూడు నెలలు ఎలా విక్రయించుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నాం..

కె.సత్యనారాయణ, కాకర్ల రైతు



తాత్కాలిక షెడ్లలో కూరగాయలు విక్రయిస్తున్నాం.. వర్షాలు వస్తే ఇబ్బందికరంగా ఉంటోంది. ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులను పూర్తి చేసి తమకు గదులు కేటాయించాలి. గత మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం.

తాత్కాలిక షెడ్లను పరిశీలిస్తాం..

మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత



రైతుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను పరిశీలించి ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. మునిసిపల్ అధికారులతో నివేదికను తయారు చేయిస్తా. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

విద్యార్థులకు సకాలంలో యూనిఫాం

- మహిళా శక్తి చాటిన స్వయం సహాయక సంఘాలు
- డీఆర్డీఏ ఆధ్వర్యంలో 56 వేలు,
- మెప్మా ఆధ్వర్యంలో 15,818 యూనిఫాంల తయారీ
- మొదటి జత స్టిచ్చింగ్ నూరుశాతం పూర్తి
- జూలై 20వరకు రెండో జత అందజేసేందుకు ఏర్పాట్లు


యూనిఫాంలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

ఖమ్మం సంక్షేమవిభాగం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాలు మరోసారి తమ శక్తిని చాటాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన యూనిఫాంను పాఠశాలల ప్రారంభం రోజుకే అందించి శభాష్ అనిపించుకుంటున్నారు జిల్లాలోని సెర్ప్, మెప్మా పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలు. గురువారం నుంచి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు ప్రారంభం కావటంతో బుధవారం సాయంత్రమే ఆయా పాఠశాలలకు యూనిఫాంలను పంపిణీ చేశారు.

పాఠశాలలు ప్రారంభం రోజే నూరుశాతం దుస్తులు సిద్ధం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని సెర్ప్ ద్వారా 20 మండలాల్లో 77 మహిళా కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు కావాల్సిన యూనిఫాంలను స్థానికంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాలకే కేటాయించారు. మొదటి జతగా ప్రభుత్వం సెర్ప్ స్వయం సహాయక సంఘాలకు 56,614 యూనిఫాంలను లక్ష్యంగా ఇవ్వగా నూరుశాతం పూర్తి చేశారు. కుట్టు పూర్తి జరిగిన దుస్తులను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు.

మెప్మా ఆధ్వర్యంలో 15,818 యూనిఫాంల పంపిణీ

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ (డీఎంసీ) సావల సుజాత ఆధ్వర్యంలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర మునిసిపాలిటీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు తొలి విడతగా సింగిల్ యూనిఫాం కుట్టే అవకాశం కల్పించారు. ఖమ్మంలోని మహాత్మా గాంధీ టీఎల్ఎఫ్ ద్వారా 10,942, సత్తుపల్లి ప్రియదర్శిని టీఎల్ఎఫ్ ద్వారా 1,685, మధిర సరస్వతి టీఎల్ఎఫ్ ద్వారా 1,600, వైరా మదర్‌థెరిస్సా టీఎల్ఎఫ్ ద్వారా 1,591 యూనిఫాంలను సకాలంలో కుట్టి పంపిణీ చేపట్టారు. నూరుశాతం యూనిఫాంలు కుట్టి రెండో జత కుట్లు ప్రారంభించారు. జూలై మొదటి వారం వరకు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

గతంలో కంటే పెరిగిన యూనిఫాం ధర



గత ప్రభుత్వం ఒక్కో జతకు కేవలం రూ.50 మాత్రమే ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వంలో కుట్టు ధరలను పెంచారు. ఒక్కో జతకు రూ.75 అందించారు. అంతేకాక వేసవి కాలంలో మహిళలు వ్యవసాయ, ఇతర ఉపాధి పనులు లేని సమయంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలకు యూనిఫాం తయారీ ద్వారా ప్రత్యక్షంగా ఉపాధి కల్పించారు. ఒక్కో మహిళా రోజుకు రూ.350 నుంచి రూ.400 వరకు యూనిఫాం తయారీ ద్వారా పొందారు. నెలకు సరాసరిగా రూ.16వేలకు పైగా ఆర్థికంగా వెసులుబాటు కలిగిందని మహిళా స్వయం సహాయక సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

నాణ్యతను పరిశీలించిన తర్వాత పంపిణీ

మెప్మా ఆధ్వర్యంలో తయారు చేసిన యూనిఫాంలను పాఠశాలల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి కుట్టు కేంద్రాల వద్దనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అప్రమత్తం చేశారు. సంబంధిత ఎంఈవోల ద్వారా ఆయా పాఠశాలలకు పంపిణీ చేపట్టారు.

యూనిఫాం తయారీ ధర పెంపుతో ఆదాయం పెరిగింది

ముప్వా ప్రీతి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు



యూనిఫాం తయారీ ధరను రూ.50నుంచి రూ.75కు ప్రభుత్వం పెంచింది. దీంతో యూనిఫాంలు నాణ్యతగా తయారు చేసేందుకు మాకు సమయం దక్కింది. వేసవి కాలంలో మూడు నెలలు పనులు లేని మహిళలకు యూనిఫాం తయారీ ఒక ఉపాధి మార్గంగా మారింది. మూడు నెలల పాటు యూనిఫాం తయారు చేశాం. ఒక్కో నెలకు రూ.16వేలకు పైగా ఆదాయం వచ్చింది. బల్లేపల్లి ప్రీతి ఎస్‌హెచ్‌జీ ద్వారా 10,942 యూనిఫాంలు తయారు చేశాం. రూ.8.5 లక్షల వరకు మహిళ సభ్యులకు ఆర్థిక ప్రయోజనం కలిగింది. రెండో జతను తయారు చేస్తున్నాం.

సర్.. మా ఊరు వచ్చి.. ఇంటికి రాకుండా వెళుతున్నారు!

మంత్రి తుమ్మలకు కందాళ సోదరుడి ఆత్మీయ పలకరింపు



కూసుమంచి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రేల వెంకటరెడ్డి కుమారుడి వివాహానికి గురువారం వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం తిరిగి ఖమ్మం వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సోదరుడైన సురేందర్‌రెడ్డి మార్గమధ్యలోని తమ ఇంటివద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాహనాన్ని ఆపారు. 'ఏంటి సార్.. మా ఊరు వచ్చి మా ఇంటికి రాకుండా వెళుతున్నారు?' అంటూ తుమ్మలను ఆప్యాయంగా పలకరించారు. మీరు పాలేరుకు ప్రాతినిధ్యం వహించిన సమయంలో రహదారులు, వంతెనలు, చెక్‌డ్యామ్‌లు, భక్తరామదాసు ప్రాజెక్టు లాంటి ఎన్నో ముఖ్యమైన అభివృద్ధి పనులు చేశారంటూ గుర్తు చేశారు. దాంతో తుమ్మల.. సురేందర్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యుల యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. తనకు ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నాయని, మళ్లీ తప్పకుండా మీ ఇంటికి వస్తాను అని సురేందర్‌రెడ్డికి తెలిపారు.

'పీఎం ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'పై

అవగాహన సదస్సులు

- ఖమ్మం జిల్లాలో 35 గిరిజన ఆవాసాల ఎంపిక
- 15 నుంచి 30 వరకు సదస్సులు : కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జూన్ 15 నుంచి 30 వరకు పీఎం ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజనుల వికాసానికి, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న పీఎం ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద ఖమ్మం జిల్లాలో 35 గిరిజన ఆవాసాలను ఎంపిక చేశామని అన్నారు. గిరిజన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ద్వారా పథకంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక క్యాంపుల్లో ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కుల సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్‌లను అర్హులకు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

● గిరిజన గ్రామాలైన మాదారం, పేరుపల్లి, భాగ్యనగర్ తండ, దుబ్బాతండా, గిద్దవారిగూడెం, మాణిక్యారం, బాజుమల్లాయిగూడెం, చీమలపాడు, గరిడేపల్లి, పొన్నేకల్, గోవిందరాల, నెమలిపురి, పింజరమడుగు, యాతాలకుంట, బుగ్గపాడు, చెరుకుపల్లి, బురదరాఘవాపురం, నాచారం, రేపల్లెవాడ, కాకరవాయి, సోలీపురం, హస్నాబాద్, ఇస్లావత్‌తండా, హైదర్‌సాయిపేట, ఎదుళ్లచెరువు, గ్రిగొళ్లపల్లి, చౌటపల్లి, భగత్‌వీడు, గోరీలపాడుతండా, కోక్యాతండా, దారవీడు, ఈర్లపూడి, చింతగుర్తి, పైనంపల్లి, లక్ష్మీపురం గ్రామాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎంపీడీవో ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు అవగాహన సదస్సులు నిర్వహించి సంబంధిత మండల కమిటీ అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ తెలిపారు.

రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

భద్రాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారు ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయ స్వామి వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

17న గోదావరి వరదలపై ముందస్తు సమీక్ష

భద్రాచలం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు ముందస్తుగా చేపట్టే చర్యలపై 17న కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాబోయే వర్షాకాలం సీజన్‌లో గోదావరి నది పరివాహక ప్రాంతంలో వచ్చే వరదల సమయంలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశ నిర్దేశం చేయనున్నారు.

సహజ సాగుకు.. సమాయత్తం

(3వ పేజీ తరువాయి)

రూ.2,481కోట్ల మూలధనంలో కేంద్ర ప్రభుత్వం రూ.1,584కోట్లు, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.897కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఇప్పటికే సాగులో సేంద్రియ పద్ధతులు పాటిస్తున్న రైతులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు), వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు) లాంటి వాటికి ఈ పథకంలో ప్రాధాన్యమిస్తారు. సేంద్రియ వ్యవసాయానికి అవసరమయ్యే సహజ ఉత్పత్తులను రైతులకు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవసరాన్ని బట్టి జీవాధార వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రైతుల పొలాల్లో రెండు వేల వరకు నమూనా సహజ వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పుతారు. ఆసక్తి గల రైతులకు నిపుణులైన శిక్షకులు (మాస్టర్‌ట్రైనర్లు) సహజ వ్యవసాయ పద్ధతులు, జీవ ఎరువుల తయారీ లాంటి వాటిలో శిక్షణనిస్తారు. జిల్లాల్లో ఎంపిక చేసిన వ్యవసాయ క్లస్టర్లలో ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు, స్థానిక రైతుల మధ్య సహకారం పెంచేందుకు 'కృషి సఖులు, సాగు సహాయకులను ఉపయోగించుకోనున్నారు.

చేకూరే ప్రయోజనాలు..

సేంద్రియ ఎరువులు, జీవసంబంధ పద్ధతుల వాడకం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూసారం మెరుగుపడుతుంది. రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గటం వల్ల వాతావరణంలో కర్బన ఉద్గారాలు తగ్గుతాయి. సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్, ధర ఉండటం వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది. సేంద్రియ ఉత్పత్తులు మానవ ఆరోగ్యానికి సురక్షితమైనవి. పోషక విలువలను అధికంగా కలిగి ఉంటాయి. సహజ వ్యవసాయం పర్యావరణ అనుకూలమైన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుంది

ప్రతీ మండలంలో ఒక క్లస్టర్ గ్రామం

దనసరి పుల్లయ్య, వ్యవసాయ అధికారి, ఖమ్మం జిల్లా

సహజ వ్యవసాయ పథకం అమలులో భాగంగా ప్రతీ మండలంలో ఒక క్లస్టర్ గ్రామాన్ని ఎంపిక చేశాం. గుర్తించిన గ్రామం లేదా గ్రామ సముదాయంలో 125 మంది ఔత్సాహిక రైతులను గుర్తించాం. జిల్లాలో అన్ని క్లస్టర్ల నుంచి మొత్తం 1,875 మంది రైతులను గుర్తించాం. వారి వ్యవసాయ కమతంలో తొలుత ఒక విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఆచరించేలా ప్రోత్సహిస్తున్నాం. మొదటి సంవత్సరం రైతులు శిక్షణలో భాగంగా క్షేత్ర సందర్శన, ఇంటి పెరట్లో అవసరాలకు సరిపడా కూరగాయల సాగుతో ప్రకృతి వ్యవసాయం ప్రారంభిస్తారు. రెండు, మూడు సంవత్సరాల్లో ఆవుపేడ, గోమూత్రం సేకరణ, జీవామృతం లాంటి బయో ఉత్పత్తుల తయారీ, మల్చింగ్, అంతర పంటల సాగు పద్ధతులు అవలంభించాలి. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన, నమ్మకం ఏర్పడి రైతు తన క్షేత్రంలో కొంత విస్తీర్ణంలో ఆచరణ మొదలుపెట్టాలి. నాలుగు, ఐదు సంవత్సరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతు తన వ్యవసాయక్షేత్రంలో ఆచరించాలి.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం

బాబురావు, వ్యవసాయ అధికారి, భద్రాద్రి జిల్లా

ప్రకృతిలో దొరికే వనరులను వినియోగించడంతో పాటు రసాయనాలు, పురుగుల మందుల వాడకం తగ్గించి వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం చేసే దిశగా కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ప్రస్తుతం రైతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది.

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బదిలీ

(3వ పేజీ తరువాయి)

జూన్ 16న బాధ్యతలు చేపట్టారు. ఏడాదిలోనే జిల్లా పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. తాను ఒక ఐఏఎస్ అధికారి అన్న విషయం పక్కన పెట్టి సామాన్యులు, రైతులు, విద్యార్థులతో ఇలా అన్ని రంగాల వారితో మమేకమై పాలన కొనసాగించారు. కలెక్టర్‌గా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని చేపట్టి శ్రీకారం చుట్టారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల ఫిర్యాదులపై శ్రద్ధపెట్టి వాటి పరిష్కారానికి కృషి చేశారు. వృద్ధులు, నిరుపేదలు, మహిళల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అధికారులతో కూడా సమన్వయంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు ఇస్తూ సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. సీతారామ ఎత్తిపోతలు ఏన్కూరు వద్ద రాజీవ్ లింక్ కెనాల్ భూసేకరణ విషయంలో చొరవ తీసుకుని సకాలంలో కాలువ పనులు పూర్తయ్యేలా కృషిచేశారు. గోదావరి జలాలను సాగర్ కాలువలకు అనుసంధానంలో చేయడంలో సహకరించారు. ఆడపిల్లలు ఇంటి మహాలక్ష్మీలా భావించాలంటూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆడపిల్లలు పుట్టిన ఇంటికి వెళ్లి స్వీట్ బాక్సులు అందించి ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా అందించేలా పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. భూ భారతి అమల్లో భాగంగా నేలకొండపల్లి, బోనకల్, ఎర్రుపాలెం మోడల్ మండలాల్లో విజయవంతంగా సర్వే కార్యక్రమాన్ని సదస్సులను నిర్వహించారు. ప్రధానంగా మున్నేరు వరదల సమయంలో ఖమ్మం నగరంలో నిత్యం బురదలోనే తిరుగుతూ బాధితుల కష్టాలను వింటూ.. వీలైనంత మేరు తీరుస్తూ భరోసా కల్పించారు. సహాయక కేంద్రాలోని వరద బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లేంత వరకు కృషిచేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కలెక్టరేట్‌కు వివిధ పనులకు వచ్చే వికలాంగులకు ఉచితంగా మధ్యాహ్న భోజనాన్ని అందించేలా కృషిచేశారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులు, మహిళలకు ప్రత్యేక వసతులు, సౌకర్యాలను కల్పించి వారి మన్ననలు పొందారు. అయితే ఆయన జిల్లాలో ఉత్సాహంగా పనిచేయాలని భావించినా జిల్లా రాజకీయ పరిస్థితులు కల్పించాయని ప్రచారం ఉంది. జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలకంగా వ్యవహరించడం, ముగ్గురి పర్యటనలు జిల్లాలో జరిగినప్పుడు కొంత ఇబ్బందికర పరిస్థితులు కలెక్టర్ ఎదుర్కోవాల్సి వచ్చింది. అలాగే ఆదివారం సెలవు దినాల్లో మంత్రుల పర్యటనలు జరగడం, ఆయా సమయాలో కలెక్టర్ విధి నిర్వహణల్లో లేకపోవడం ఒకింత ఇబ్బంది కలిగించింది. దీంతో ఆయన బదిలీ కోసం కొన్ని రోజులుగా ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌కు బదిలీ చేయించుకునే ప్రయత్నంలో రాష్ట్ర పౌరసఫరాల శాఖ కమిషనర్‌గా నియమితులయ్యారు. జిల్లాలో వర్షాకాలం, యాసంగిలో ధాన్యం సేకరణలో శ్రమించారు. ఈ అనుభవం కూడా కమిషనర్‌గా ఆయనకు మరింత ఉపకరించనుంది.

మోగిన బడిగంట

(3వ పేజీ తరువాయి)

దొరుకుతుందని, తల్లితండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. నాణ్యమైన విద్యా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ఎన్ఎస్పీ పాఠశాలలో పునఃప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి విద్యార్థులకు స్వాగతం పలికారు.

భద్రాద్రి జిల్లాలోనూ బడులు పునఃప్రారంభమవగా.. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సుభాష్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్ తొలిరోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలను అందించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దమ్మపేట, అశ్వారావుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు యూనిఫామ్స్ అందజేశారు. డీఈవో యం. వెంకటేశ్వరచారి లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ జడ్పీహెచ్ఎస్, లక్ష్మీదేవిపల్లి జడ్పీహెచ్ఎస్, చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ పీఎస్, జీహెచ్ఎస్ చుంచుపల్లి, యుపీఎస్ పెనుబల్లి పాఠశాలలను సందర్శించి వసతులపై ఆరా తీసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాటలో 1వ తరగతిలో 2,140మంది, 2నుంచి 10వరకు 999మంది ప్రవేశాలు కల్పించారు.

రైతు కుటుంబం నుంచి వచ్చిన గౌతమ్



కొత్తగూడెం,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి (పా)గా నియమితులైన పోట్రు గౌతమ్ స్వగ్రామం ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా (పూర్వ కృష్ణా జిల్లా) గంపలగూడెం మండలం గుల్లపూడి గ్రామం. గౌతమ్ తండ్రి మురళీధర్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. గౌతమ్ పాఠశాల విద్య, ఇంటర్ పూర్తయిన అనంతరం గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లోని ధీరాభాయి అంబాని ఇనిస్టిట్యూట్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్సు పట్టా పొందారు. అనంతరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడడానికి అవకాశమున్నా ఆ వైపు వెళ్లలేదు. ప్రజల మధ్య ఉండి వారికి సేవ చేయాలనే లక్ష్యంతో సివిల్స్ పరీక్షలు రెండు సార్లు రాసినా ఆశించిన ర్యాంకు రాకపోయినప్పటికీ నిరాశచెందకుండా మరింత పట్టుదలతో మూడో సారి రాసి 318వ ర్యాంకును సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. అనంతరం మరోసారి సివిల్స్ రాసి 30వ ర్యాంకు సాధించి ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. అసిస్టెంట్ సెక్రటరీగా మూడు నెలల పాటు శిక్షణ పొందారు. 2015 ఐఏఎస్ బ్యాచ్ నుంచి తెలంగాణకు ఎంపికైన గౌతమ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్స్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. 2017 జూలై 3 నుంచి 2017 సెప్టెంబరు 29 వరకు 3 నెలల పాటు ఆయన ఆ విభాగంలో పనిచేశారు. తొలి పోస్టింగ్‌లో మెట్‌పల్లి సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి.. ఆ తర్వాత భద్రాచలం ఐటీడీఏ పీవోగా పిఓగా ఉద్యోగోన్నతిపై వచ్చారు. అనంతరం మేడ్చల్ కలెక్టర్‌గా వెళ్లిన ఆయన తాజా బదిలీల్లో భాగంగా సింగరేణి డైరెక్టర్ (పా)గా నియమితులయ్యారు.

ఒక్కరి నుంచి.. పదిమంది..

'బ్రాండ్ అంబాసిడర్' కీర్తన స్ఫూర్తితో పెరిగిన విద్యార్థుల సంఖ్య ▸ నారపనేనిపల్లి పాఠశాలలో తొమ్మిది మంది చేరిక


విద్యార్థులతో కళకళలాడుతున్న తరగతి గది


విద్యార్థిని కీర్తనను అభినందిస్తున్న కలెక్టర్(ఫైల్)

వైరా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నారపనేనిపల్లి పాఠశాల.. గత విద్యాసంవత్సరం వరకు ఒక విద్యార్థిని మాత్రమే ఉన్న పాఠశాల. ఆ పాఠశాలకు ఆ విద్యార్థినే బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. ఫలితంగా గురువారం పునఃప్రారంభమైన పాఠశాలలో మరో తొమ్మిదిమంది విద్యార్థులు చేరారు. దీంతో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పదికి చేరుకుంది. మరో ముగ్గురు లేక నలుగురు విద్యార్థులు పాఠశాలలో చేరే అవకాశముందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మండలంలోని నారపనేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గతేడాది నందిగామ కీర్తన అనే ఒక్క విద్యార్థిని మాత్రమే నాలుగోతరగతి చదివింది. దాంతో నాడు ఇక్కడున్న ఒక ఉపాధ్యాయుడిని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. చివరకు ఏకైక ఉపాధ్యాయుని ఉమపావని.. ఏకైక విద్యార్థిని కీర్తనకు చదువు చెప్పారు. తొలుత కీర్తన కూడా వేరే పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవగా.. తాను కూడా పాఠశాల వదిలి వెళితే బడి మూతపడే అవకాశం ఉండటంతో.. అక్కడే నాలుగో తరగతి పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో కీర్తన.. కలెక్టర్, ఇతర అధికారుల దృష్టిని ఆకర్షించి అభినందనలు అందుకుంది. అయితే గతేడాది ఏక విద్యార్థినిగా ఉన్న ఆ పాఠశాల మూతపడే దశకు చేరుకున్న విషయం తెలుసుకున్న కలెక్టర్.. అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా, మండల విద్యాశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వారంతా అనేకసార్లు పాఠశాలను సందర్శించి కీర్తన, తండ్రి అనిల్‌శర్మకు నచ్చజెప్పి పాఠశాల మూతపడకుండా కాపాడారు. దాదాపు రూ.ఆరులక్షల నిధులు మంజూరు చేసి పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించి ముస్తాబు చేశారు. కోతుల బెడద లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. అదే తరుణంలో గ్రామంలోని ఇతర విద్యార్థుల తల్లిదండ్రులను.. అధికారులంతా కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. నారపనేనిపల్లి పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏకంగా ఈ పాఠశాల కొనసాగించేందుకు విద్యనభ్యసించిన కీర్తన ఫొటోను పాఠశాల తరగతి గదులపై ప్రత్యేకంగా చిత్రీకరించారు. దాంతో పాఠశాల మూతపడకుండా కాపాడిన కీర్తన బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్వయంగా ఈ గ్రామాన్ని సందర్శించి బడిబాటలో పాల్గొని పలు హామీలు ఇచ్చారు. కీర్తను అభినందించి.. గ్రామంలోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో తొమ్మిదిమంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు గురువారం ఆ పాఠశాలలో చేర్పించారు. ఇప్పుడు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పదికి చేరుకుంది. ఇక్కడి నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడు రాంబాబును కూడా తిరిగి ఇదే పాఠశాలలో నియమించారు. పాఠశాలల పునఃప్రారంభం రోజు ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉమాపావని, రాంబాబులు విద్యార్థులతో ప్రార్థన చేయించారు. కొత్త కళను సంతరించుకున్న పాఠశాల తరగతి గది పదిమంది విద్యార్థులతో కళకళలాడింది. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు స్వయంగా తీసుకురావడంతో అంతా ఆనందం వ్యక్తం చేశారు.



రేపు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మంలీగల్, జూన్12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం ఉదయం నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ తెలిపారు. మొత్తం 13 బెంచిలను ఏర్పాటు చేస్తుండగా రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, మోటారు వాహనాల ప్రమాదాలకు సంబంధించినవి, వివాహ సంబంధిత, బ్యాంక్ కేసులను పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. పోలీసు, బీమా కంపెనీల బాధ్యులతో చర్చించి రాజీపడదగిన కేసులను గుర్తించామని తెలిపారు. న్యాయవాదులు కక్షి దారులు సహకరించాలని సూచించారు.

శ్మశాన వాటికకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంరూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్ లో శ్మశాన వాటికకు ప్రత్యామ్నాయ స్థలం చూడాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. జలంగనర్‌లోని డాడీ లంబాడ శ్మశాన వాటికను గురువారం కలెక్టర్, అధికారులు పరిశీలించారు. వరదల నుంచి రక్షణ కోసం నిర్మించే కరకట్ట నమూనాను మార్చాల్సిన పనిలేదన్నారు. జలగంనగర్‌లో సర్వే నంబర్ 156, 167లో 30 గుంటల భూమిలో శ్మశాన వాటిక ఉందన్నారు. కరకట్ట నిర్మాణంలో భాగంగా కొంత భూమి పోతుందన్నారు. స్మశాన వాటికను సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు, ప్రహరీ గోడ వంటి వసతులతో



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కలెక్టర్

స్మశాణ వాటిక నిర్మాణం చేపడతామన్నారు. వారం రోజుల్లో అనుకూలమైన స్థలం ఎంపిక చేసి ప్రతిపాదనలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి

ఖమ్మం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటిస్తే వరిలో చీడ పీడల ఉధృతి తగ్గించవచ్చని భారతీయ వరి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సి.హెచ్. పద్మావతి తెలిపారు. గుదిమళ్ళ గ్రామంలో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వరిని ఆశించు దోమ కాండం, తొలుచుపురుగు, ఆకు ముడత, ఉల్లికోడు, కంకినల్లి, అగ్గితగులు ఎండాకు తెగులు, పొట్టకుళ్ల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వారి సంస్థ రూపొందించిన రైస్‌క్లినిక్ యాప్ గురించి తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం వివరించారు. కె.వి.కె. గడ్డిపల్లి సీనియర్, సైంటిస్ట్ హెచ్ ఇన్‌ఛీ డి.నరేష్ భూసార పరీక్షకు మట్టిని సేకరించే విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమానగేస్, ఏఈవో ఆదర్శ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఏఐ టూల్స్‌తో ప్రభుత్వ బడుల్లోనూ ఆంగ్ల విద్య

- కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు
- స్కూళ్ల ప్రారంభం రోజే పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ
- పువ్వాడ ఉదయ్‌నగర్ పాఠశాల ప్రారంభంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం, జూన్12(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ సహకారంతో ప్రభుత్వ బడుల్లోనూ మెరుగైన ఆంగ్ల విద్యాబోధనను అందుబాటులోకి తెస్తున్నామని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు.గురువారం రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన ఆయన విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలను కల్పించామని, బడులు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నామన్నారు. వేసవి సెలవుల అనంతరం పండుగ వాతావరణంలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైందని, అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో మూత పడిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి విద్యార్థులతో నిండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని, ఆ మేరకు ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ కంటే మెరుగైన పదో తరగతి ఫలితాలు వచ్చాయని, జిల్లాలో ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, తహసీల్దార్ శ్వేత, ఎంఈవో రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

నేలకొండపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులుండటం వల్ల నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా ఒకేషనల్ విద్యాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల, విద్యార్థుల సమావేశంలో రవిబాబు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో బాలిన చలపతిరావు, ప్రధానోపాధ్యాయుడు హరిశ్రీనివాస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు ఫణికుమారి, శ్రీదేవి పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను హెచ్ఎం నల్లగుంట్ల మధుసూదన్‌రావు అందించారు.

మూతబడిన పాఠశాలను తెరిపించిన అధికారులు

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని డాక్యా తండాలో రెండు సంవత్సరాలుగా జీరో ఎన్రోల్మెంట్‌తో మూతబడి ఉంది. విద్యాశాఖ అధికారులు గ్రామపెద్దలతో మాట్లాడి గురువారం తెరిపించారు. 9మంది విద్యార్థులతో పాఠశాలను పునఃప్రారంభించారు. సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎంపీడీవో కుమార్ పాఠ్యపుస్తకాలు,ఏకరూప దుస్తులు, బ్యాగులు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ సురేష్

కూసుమంచి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఎస్ఐ సురేష్ తెలిపారు. గత ఏడాది పాలేరు జలాశయానికి వరద పోటెత్తిన కారణంగా పాలేరు, నాయకన్‌గూడెం, ఇతర పరిసర గ్రామాల్లో వరదనీరు చేరి ఇబ్బందులు పడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో కూసుమంచి తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం పాలేరు, నాయకన్‌గూడెం, నర్సింహులగూడెం గ్రామాల్లో పర్యటించింది. పరిసరాలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించారు. చుట్టుపక్కల చెరువులు, కాలువలు ఉంటే వాటిలో నీటి మట్టాన్ని గమనిస్తూ, ఇంట్లో అవసరమైన వస్తువులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఎంపీవో రామచంద్రరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

ఏదులాపురం సహకార సంఘం చైర్మన్‌పై విచారణ

ఖమ్మంరూరల్,జూన్12(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ జర్పుల లక్షణ్ రైతుల పేరుతో రుణాలు తీసుకుని వాటిని చెల్లించకుండా తిరిగి రైతులను రుణాలు చెల్లించాలని చెపుతుండటంతో సంబంధిత రైతులు జిల్లా సహకార అధికారులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి (డీసీవో) గంగాధర్, అధికారులు ఉషశ్రీ, రాంరెడ్డి గురువారం సొసైటీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. రైతుల నుంచి వివరాలు సేకరించారు. లక్ష్మణ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కల్లెం వెంకటరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

పోరాటాలతోనే ఇళ్ల స్థలాల సాధన

వామపక్ష, బీఆర్ఎస్ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్12(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే ఇళ్ల స్థలాలు దక్కుతాయని, ప్రభుత్వం దృష్టికి సమస్య తెలిసేలా నిరసన కార్యక్రమాలు చేయాలని వామపక్ష, బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండల కేంద్రంలో సర్వే నెంబర్ 2018లో ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసిందని ఆరోపిస్తూ ఖమ్మం మంచికంటి భవన్‌లో సీపీఎం మండల కార్యదర్శి ఎస్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇళ్లస్థలాల బాధితులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆ స్థలాలను రద్దు చేయటం అన్యాయం చేయటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి బీ విక్రమ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, బీఎస్పీ జిల్లానాయకులు ఉపేంద్రసాహు, సీపీఐజిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, మార్ ఎల్రైన్ జిల్లాకమిటీ సభ్యురాలు ఆవుల మంగతాయి, ప్రవీణ్ సమస్యలపై మాట్లాడారు.

కమ్యూనిస్టులే పేదల పక్షాన పోరాడేది

బాగం హేమంతరావు

కామేపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల పక్షాన పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీనేనని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్లగూడెంలో పుచ్చకాయల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మండల 18వ మహాసభలో మాట్లాడారు. గ్రామాల ప్రజల జీవన ప్రమాణా మార్పుకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండనని అన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేస్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎర్రబాబు, ఏపూరి లతాదేవి, సీపీఐ జిల్లా కార్యదిర్శ వర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామక్రిష్ణ, సహాయ కార్యదర్శి శివ, మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల క్రిష్ణ పాల్గొన్నారు

కేసీఆర్‌ను తరిమేసింది టీడీపీనే

ఖమ్మంమామిళ్లగూడెం, జూన్12 (ఆంధ్రజ్యోతి): 2023లో కేసీఆర్‌ను ఇంటికి పంపించింది తెలుగుదేశం పార్టీ శ్రేణులేనని ఖమ్మం జిల్లా టీడీపీ నాయకులు కేతినేని హరీష్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కేతినేని ఖండించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువుని కేసీఆర్ తెలంగాణ నుంచి తరిమేశాడు అని వ్యాఖ్యానించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే భవిష్యత్తులో ఎన్నికలతో మీ కుటుంబాన్ని రాష్ట్రం నుంచే తరిమేస్తారని కేతినేని హితవు పలికారు.

మత్స్య రైతులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేతలు

కూసుమంచి, జూన్12 (ఆంధ్రజ్యోతి): పాలేరు మత్స్యపరిశోధనాకేంద్రంలో ఖమ్మం, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, మెదక్, కరీంనగర్, కొమరంభీం, ఆసిఫాబాద్, వరంగల్, జనగాం, సిరిసిల్ల తొమ్మిది జిల్లాలకు చెందిన ఔత్సాహిక మత్స్యరైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పాలేరు మత్స్య పరిశోధనాస్థానం సీనియర్ సైంటిస్ట్ శ్యామ్‌ప్రసాద్ చేపల పట్టుబడి, ప్యాకేజింగ్, రవాణా పద్ధతులు, నైపుణ్యాభివృద్ధి అంశాలపై శిక్షణ ఇచ్చారు. క్యాక్రమంలో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మత్స్యకళాశాల పీహెచ్‌డీ స్కాలర్ శాంతన్న, వనపర్తి జిల్లా ఫిషరీస్ కళాశాల అస్టెంట్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి, మత్స్యశాస్త్రవేత్త రవీందర్ శిక్షణలో పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలనే అమ్మాలి: డీఏవో

నేలకొండపల్లి,జూన్12(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నుంచి అనుమతి ఉన్న కంపెనీల నుంచి తెచ్చిన నాణ్యమైన విత్తనాలనే రైతులకు అమ్మాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య విత్తన డీలర్లను ఆదేశించారు.మండల పరిధిలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలనుమండల వ్యవసాయాధికారి రాధతో కలిసి డీఏఓ పుల్లయ్య గురువారం తనిఖీ చేసారు. నకిలీ విత్తనాను అమ్మిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ డీలరు తాను అమ్మే విత్తనాల వివరాలను, స్టాకును, ధరల పట్టీతో సహా షాపుల్లో ప్రదర్శించాలన్నారు. రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. షాపులో కొనుగోలు చేసిన రైతుకు తప్పనిసరిగా బిల్లులివ్వాలన్నారు.ఫైనంపల్లి, నాచేపల్లి, అప్పలనర్సింహాపురం, మంగాపురంతండాల్లోని షాపులను తనిఖీ చేసారు. షాపుల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకును రికార్డులతో సరి చూసారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఆహ్వానం

ఖమ్మంఖానాపురం హవేలి, జూన్12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక పది, ఇంటర్మీడియట్‌లో చేరటానికి 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల12 నుంచి జూలై11 వరకు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు.

15న టీజీవో హౌజ్ బిల్డింగ్ సొసైటీ సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మ్యూచువల్ కో-ఆపరేటివ్ హౌజ్‌బిల్డింగ్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని ఈనెల 15న మధ్యాహ్నం టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు కట్ట కిషోర్, కార్యదర్శి పి. విజయ్ కుమార్ తెలిపారు. సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

ప్రయాణికులు ఉన్నా బస్సు ఆపని డ్రైవర్



ఆపకుండా వెళుతున్న బస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తన భార్యను కొణిజర్ల పంపేందుకు సోమవారం రోటరీనగర్ బస్టాండ్‌కు వస్తుండగా, మధిర డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు వెళుతోంది. దీంతో తన ద్విచక్ర వాహనంపై కలెక్టరేట్ వద్దకు చేరుకొని బస్సును ఆపేందుకు యత్నించాడు. ఐనప్పటికీ ఈ బస్సు ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో పక్కనే ఉన్న వెంకటాయపాలెం స్టేజీ వద్దకు వెళ్లగా అక్కడ కూడా ఆపకుండా వెళ్లింది. దీంతో తనికెళ్ల వద్ద బస్సును తన ద్విచక్ర వాహనం అడ్డుపెట్టి ఆపాల్సి వచ్చిందని ఆ ప్రయాణికుడు ఆంధ్రజ్యోతికి వివరించారు. దీంతో ఆ ప్రయాణికుడు కండకర్టను బస్సు ఎందుకు ఆపకుండా వెళ్తున్నారని ప్రశ్నించగా ఈ బస్సు ఎక్స్‌ప్రెస్ ఎక్కడబడితే అక్కడ ఆగదు అని సమాధానం చెప్పాడు. ఆ బస్సుపై పల్లెవెలుగు అని రాసేఉందని, ఎక్స్‌ప్రెస్ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఉందిగా ఎందుకు ఆపరు అంటూ డ్రైవర్‌ను నిలదీశాడు. ఈ సమయంలో బస్సులో సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ఆ తరువాత కొందరు ప్రయాణికులు తనికెళ్లలో బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా తనికెళ్ల నుంచి వైరాకు రూ.80 చార్జీ అవుతుందని అలా ఐతేనే ఎక్కండి అంటూ చెప్పటంతో ఆ ప్రయాణికులు బస్సు దిగిపోయారు. దీనికి సంబంధించి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

బాలకార్మికత నిర్మూలనకు ఉద్యమం చేద్దాం

సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్12(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను అంతం చేయటానికి జాతీయ ఉద్యమం చేద్దామని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంలో మాట్లాడారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ హరిప్రసాద్, కార్మిక శాఖ అధికారి వెంగమాంబ, కోఆర్డినేటర్ శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ అకాడమీలో ప్రవేశాలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నగరంలోని అథ్లెటిక్స్ అకాడమీ ప్రవేశాలకు గురువారం స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, మహబూబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, సంగారెడ్డి తదితర 10 జిల్లాల నుంచి సుమారు 30 మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో భాగంగా క్రీడాకారులకు జనరల్, ఫిజికల్, పరుగు పోటీలను నిర్వహించారు.

కేంద్ర పథకాలతోనే తెలంగాణ అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబన్న

ఖమ్మంమార్కెట్,జూన్12(ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబన్న, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోడీ పథకాలతో రాష్ట్రంలో లక్షల మంది లబ్ధి పొందుతున్నారని, సుమారు పది కేంద్ర పథకాలతో రాష్ట్రంలో బీజేపీ మార్క్ ముద్ర పడిందని అన్నారు.

ఆర్జేసీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్స్

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్12(ఆంధ్రజ్యోతి): కాకతీయ యునివర్సిటీ ప్రకటించిన ర్యాంకులలో ఖమ్మం నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాల విద్యార్థిని సాయి వీర సుప్రియ రెండు గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల. కృష్ణ తెలిపారు. జూలై 7న నిర్వహించే స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా బవగారు పథకాన్ని అందుకుంటుందని తెలిపారు.

నేటినుంచి పమ్మి గ్రామానికి బస్ సర్వీస్ ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం డిపో నుంచి పమ్మి గ్రామానికి శుక్రవారం నుంచి నూతన ఆర్టీసీ బస్ సర్వీస్‌ను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం పాతబస్టాండ్ నుంచిఉదయం 8గంటలకు, సాయంత్రం 4:30 గంటల బస్ ఖమ్మం నుంచి బయలుదేరి ముదిగొండ, లక్ష్మీపురం, చిరుమర్రి మీదుగా పమ్మి చేరుకుంటుందని తెలిపారు.

వధూవరులకు తుమ్మల ఆశీర్వాదం

కూసుమంచి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపేటలో వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కాంగ్రెస్ నాయకులు రేల వెంకటరెడ్డి కుమారుడి వివాహం ఇటీవల జరిగింది. ఈసందర్భంగా గురువారం సాయంత్రం రాజుపేటలో వారిని ఆశీర్వదించారు.

15న నెలనెలవెన్నెల

ఖమ్మంసాంస్కృతికం,జూన్12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినెలా నిర్వహించే 'నెలనెల వెన్నెల' ఈనెల15న సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అనశ్వరం నాటికను ప్రదర్శిస్తారని చెప్పారు. బల్రెసత్యనారాయణ రచించిన ఈనాటికకు ద్వాదశి వెంకట చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి బత్తిని చారిటబుల్‌ట్రస్ట్ బాధ్యులు బత్తిని నాగప్రసాద్, బత్తిని నీరజ, ముఖ్య అతిధిగా కార్పొరేటర్ కమర్తపు మురళి పాల్గొంటారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, జూన్12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కిలారు ఉపేందర్(39) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సొంత ట్రాక్టర్‌కొని కిరాయిలకు వెళుతున్నాడు. ఈనేపథ్యంలో బుధవారం ఓ రైతుకు చెందిన పొలం దున్నేందుకు వెళ్లాడు. ఈక్రమంలో పొలంలో పనిచేస్తుండగా ట్రాక్టర్‌కు రాయి అడ్డురావడంతో అదుపు తప్పి ట్రాక్టర్ మీదనుంచి కిందపడ్డాడు. ఈఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైదరాబాదు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య ఉన్నారు.ఎస్ఐ జగదీష్ కేసు నమోదు చేశారు.

137 మందికి చెక్కుల పంపిణీ

తిరుమలాయపాలెం, జూన్12 (ఆంధ్రజ్యోతి): గురువారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో తిరుమలాయపాలెం మండల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ జరిగింది. 137 మందికి సుమారు రూ.45 లక్షల రూపాయల విలువచేసే చెక్కులను కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి అందించారు.

21, 22 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, జూన్12(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగరంలోని జూబ్లీక్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎంపికల వివరాలను వారు వెల్లడించారు. ఎంపికలలో భాగంగా అండర్-13, 15, 17, 19, బాలురు, బాలికలకు, మెన్ అండ్ ఉమెన్ విభాగాలతో పాటు మాస్టర్స్ విభాగంలో 35ప్లస్ ఏజ్‌గ్రూప్ నుంచి 40, 45, 50, 55, 60, 65, 70, 75ప్లస్ ఏజ్ గ్రూప్ వారికి సింగిల్స్, డబుల్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని అన్నారు.ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 19 సాయంత్రం 5గంటలకల్లా 9396972349, 9492961900 నెంబర్లను సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యా ప్రమాణాలు

» అదనపు కలెక్టర్ శ్రీజ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఎర్రుపాలెం, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపాఠశాలల్లో మెరుగైన విద్యాప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. గురువారం మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామ హరిజనవాడలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను ఆమె పునఃప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించారుపాఠశాలలోని విద్యార్థులతోముచ్చటించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేందర్, ఎంఈవో మురళీమోహన్, ఎంపీవో శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమయ్యాయి. ముదిగొండ జడ్పీఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు పాఠ్య, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం మండలంలోని బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం పండగ వాతావరణంలో ప్రారంభించారు. విద్యార్థులకు ప్రత్యేకంగా పూలు,పండ్లు పంపిణీచేసి పాఠశాల్లోకి ఆహ్వానించారు. విద్యార్థులకునోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం సాగి సుజాత, ఏఏపీసీ చైర్మన్ హేమలత, ఉపాధ్యాయులు పొట్ట రామారావు, విజయశ్రీ, శ్రీనివాసరావు, పుల్లయ్య, భారతి, నరేష్, నాగేశ్వరరావు, బాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలతో ఉచితంగా మెరుగైన విద్యాబోధన జరుగుతుందని తల్లాడ మండలం ఎంఈవో ఎన్.దామోదరప్రసాద్ అన్నారు. గురువారం తల్లాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉంగరాల వెంకటేశ్వర్లు, దగ్గుల కమలాకరరెడ్డి పాల్గొన్నారు.

తల్లాడ, జూన్12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే పోటీతత్వం అలవడి ఉద్యోగాలు సాధించవచ్చని తల్లాడ తహసీల్దార్ వి.సురేష్‌కుమార్ అన్నారు.. గురువారం అంజనాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కూడాప్రభుత్వ విద్యాసంస్థలో చదివి ఉద్యోగం సాధించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్, హెచ్‌ఎం. జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల ప్రత్యేకాధికారి కడారి విజయభాస్కరరెడ్డి, ఎంఈవో దామాల పుల్లయ్యలు తెలిపారు. బోనకల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వారు విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఏపీసీ సభ్యులు పాల్గొన్నారు.

మధిరటౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం పుస్తకాలు, దుస్తులు అందజేశారు. సీపీఎస్ పాఠశాలలో తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ అందజేయగా, టీవీఎం పాఠశాలలో ఎంఈఓ ప్రభాకర్ అందజేశారు.

ముందుకు రాని విద్యార్థులు...

వైరా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అష్ణగుర్తి హైస్కూల్‌లో విద్యార్థులు లేని కారణంగా గురువారం నడవలేదు. ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు హాజరై పాఠశాల వేళలు ముగిసేవరకు అక్కడే ఉండి తర్వాత వెళ్లిపోయారు. విద్యార్థులు లేని కారణంగా గత ఏడాది అష్ణగుర్తి హైస్కూల్ మూతపడింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను వివిధ ప్రాంతాల్లోని పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై నియమించారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ముగ్గురు ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థుల కోసం వారు ఎదురుచూసినప్పటికీ ఫలితం కన్పించలేదు. అష్ణగుర్తి గ్రామంలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ వైరా ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో మాట్లాడి ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అతికష్టం మీద తల్లిదండ్రులు ఆఇద్దరు విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చినప్పటికీ ఆవెంటనే తిరిగి వెళ్లిపోయారు. ఈ ఏడాది అష్ణగుర్తి హైస్కూల్ నడిచే పరిస్థితి కన్పించడం లేదు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న గౌండ్లపాలెం పాఠశాల



ఏన్కూరులో పాఠశాలను ప్రారంభిస్తున్న విద్యార్థులు

వైరా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకగిరి సిరిపురం గ్రామపంచాయతీ పరిధిలో గత నాలుగేళ్ల కిందట మూతపడిన గౌండ్లపాలెం ప్రాథమిక పాఠశాల గురువారం పునఃప్రారంభమైంది. విద్యార్థులు లేక నాలుగేళ్ల కిందట ఈ పాఠశాలను మూసివేశారు. విద్యార్థులు లేని కారణంగా పాఠశాలను మూసివేసి ఇక్కడి టీచర్‌ను వేరే పాఠశాలకు బదిలీ చేశారు. అయితే జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాలతో డీఈవో సత్యనారాయణ, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు గ్రామంలోని తల్లిదండ్రులను ప్రోత్సహించి వారి పిల్లలను పాఠశాలకు పంపించేవిధంగా ఒప్పించారు. గౌండ్లపాలెంలో మొత్తం ఏడుగురు విద్యార్థులుండగా ఐదుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. దాంతో గన్నవరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కరుణాకర్‌ను ఇక్కడ నియమించారు. దాంతో పాఠశాల పునఃప్రారంభమైంది.

రెండేళ్ల తర్వాత రాజుపాలెం పాఠశాల...

ఏన్కూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం రాజుపాలెం ప్రాథమిక పాఠశాల గురువారం పునఃప్రారంభమైంది. రెండేళ్లక్రితం మూతబడిన పాఠశాలను అందంగా మామిడాకు తోరణాలతో అలంకరించిన పాఠశాల సీఎంవో రాజశేఖర్ ఎంఈవో రహీంబీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కూరాకుల సైదయ్య కలిసి ప్రారంభించారు. ప్రస్తుతం 23మంది విద్యార్థులు ఈపాఠశాలలో చేరారు. ఈకార్యక్రమలో ఉపాధ్యాయులు బోడ శివ, సింధు సీఆర్పీలు లచ్చిరాంప్రసాద్,శివాజి శోభన్ తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో మాట్లాడుతున్న ఎంఈవో దామోదరప్రసాద్



ముదిగొండలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బోనకల్‌లో దుస్తులను పంపిణీ చేస్తున్న అధికారులు

మూతబడిన బడులకు మహర్దశ

» ఓ ఉపాధ్యాయుడి కృషితో మూడు స్కూళ్లు పునఃప్రారంభం

» బడిబాటతో పాటు తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చిన చాందుసాహెబ్



ఓబుల్‌రావుబంజర పాఠశాలలో తొలిరోజున ప్రవేశం పొందిన విద్యార్థులు

కల్లూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లేక మూడేళ్ల క్రితం మూతపడిన కల్లూరు మండలంలోని మూడు పాఠశాలలు మళ్లీ తెరుచుకున్నాయి. ఇందుకు ఓ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడి కృషే కారణం. మండల పరిధిలోని ముచ్చవరం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు యస్‌కే చాందుసాహెబ్.. తాను పని చేసే ముచ్చవరంలో బడిబాట నిర్వహించడంతో పాటు విశ్వనాథపురం, ఓబుల్‌రావు బంజర, పాయాపూరు గ్రామాల్లోని ప్రజలతో ఉన్న సత్సంబంధాలతో అక్కడి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, అందుబాటులోకి తెచ్చిన మెరుగైన సౌకర్యాల గురించి వివరించి పిల్లల తల్లిదండ్రులను మెప్పించారు. దాంతో ఈ ఏడాది సదరు పాఠశాలల్లో పిల్లలకు అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఓబుల్‌రావుబంజర, పాయాపూరు, లక్ష్మీపురంలోని మరో పాఠశాలను బుధవారం పునఃప్రారంభించారు. ఈ ఏడాది బాడిబాట కార్యక్రమంలో భాగంగా మూతబడిన పాఠశాలలపై సమీక్షించిన కలెక్టర్.. పలు సూచనలు చేశారు. చివరకు ఆయా పాఠశాలలను మళ్లీ తెరవడంతో చాందుసాహెబ్‌తో పాటు సదరు ఉపాధ్యాయులను అభినందించారు. ఓబుల్‌రావుబంజర పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులతో గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సరదా గడపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం గలిగిన ఉపాధ్యాయులచే ఆంగ్ల బాషాలో కూడా ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని పిల్లల తల్లిదండ్రులకు కలెక్టర్ భరోసా కల్పించారు. అయితే హెచ్‌ఎం పి.మధు, ఉపాధ్యాయుడు చాందుసాహేబ్ కృషి ఫలితంగా ఓబుల్‌రావుబంజర, పాయాపూరు పాఠశాలలను పునఃప్రారంభించినట్లు, గతేడాది ఇదే తరహాలో విశ్వానాథపురం పాఠశాల కూడా ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాలల వసతి సౌకర్యాల కల్పన కోసం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రూ.10 లక్షల నిధుల చెక్కును కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్‌కు అందించారు. ఇక విద్యాశాఖ ఆదేశాలతో ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్న ఇద్దరేసి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించారు. ముచ్చవరం ఉపాధ్యాయుడు చాందుసాహెబ్ స్టేషనరీ సామగ్రిని వితరణగా అందించారు.



చాందుసాహెబ్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

వేంసూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. వేంసూరు మండలంలోని చిన్నమల్లెల గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని, ఇందిరమ్మ గృహాలను గురువారం ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, రూ.500గ్యాస్, రుణమాఫీ అమలుచేస్తామని పేర్కొన్నారు. రైతుభరోసా డబ్బులు నాలుగు ఎకరాల వరకే వేశామని మిగతా రైతులకు కూడా త్వరలోనే డబ్బులు జమచేయటం జరుగుతుందన్నారు. ఈ మూడున్నర సంవత్సరాల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించటం జరుగుతుందని చెప్పారు. అనంతరం వేంసూరు జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజారావు, తహసీల్దార్ మాణిక్యరావు, ఏవో రామ్మోహన్‌రావు, పీఆర్ డీఈ, ఏఈలు, నాయకులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

డిప్యూటీ సీఎంను కలిసిన నూతి సత్యనారాయణ

వైరా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన నూతి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కను సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. టీపీసీసీ కార్యదర్శిగా నియమించినందుకు భట్టి విక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని నూతికి డిప్యూటీ సీఎం సూచించారు.

జలగం వెంళరావుకు నివాళి

వేంసూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు వర్ధంతిని గురువారం మండలంలోని గూడూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు విగ్రహానికి ఎమ్మెల్యే మట్టా రాగమయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, సోమిరెడ్డి, మల్లెల నర్సింహారావు, వెంకటేశ్వరరావు, ఒగ్గు కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పెనుబల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 27వ వర్ధంతి వేడుకలను గురువారం వీఎంబంజర్‌లో నిర్వహించారు. రింగ్ సెంటర్లో జలగం వెంగళరావు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, జలగం అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, ఈడా కమలాకర్‌రావు, మేకతొట్టి కాంతయ్య, వంగా దామోదర్‌రావు, షేక్.కరీముల్లా, మిట్టపల్లి కిరణ్‌కుమార్, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, గిరిజాపతిరావు, వేముల నర్సింహారావు, కవి, విశ్రాంత ఉపాధ్యాయుడు గోపిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్‌షాపు తనిఖీ

వైరా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ సుందరయ్యనగర్‌లోని రేషన్ షాపును జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి(డీఎస్‌వో)చందనకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణంలో ఉన్న బియ్యం స్టాక్ రికార్డులను పరిశీలించారు. మూడునెలలకు చెందిన రేషన్‌బియ్యాన్ని నెలరోజులపాటు వినియోగదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. సివిల్‌సప్లయి డీటీ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అమలు కాని హామీలు


» బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కావడం లేదని బీజేపీ తమిళనాడు, కర్నాటక సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లిలో జరిగిన వికసిత్ భారత్ మేథో సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు రూ.నాలుగు వేలకు పెంచుతామని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో అదనంగా తులం బంగారం ఇస్తామని, మహిళలకు రూ.2500 ఇస్తామని హామీ గుప్పించి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు ప్రజలకు చేసేది ఏమీ లేదని, వారి సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారని ఆరోపించారు. నరేంద్రమోదీ, అమిత్‌షా కృష్ణార్జులుగా దేశాన్ని కాపాడుతున్నారు. ఉగ్రవాదాన్ని బీజేపీ ప్రభుత్వం నామరూపాల్లేకుండా చేస్తోందని అన్నారు. గత 11 ఏళ్ల మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. మన రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు వేల కోట్ల నిధులను బీజేపీ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, వీరం రాజు, నాయకులు నాయుడు రాఘవరావు, ఈవీ రమేష్ పాల్గొన్నారు.

ఫార్మసీ ఫలితాల్లో బ్రౌన్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సింధు రచన తేజస్విని శివాని

కొణిజర్ల, జూన్12(ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వ విద్యాలయం వారు ఔషధశాస్త్రంకు సంబంధించి 2018, 2019, 2021 సంవత్సరానికి గాను ప్రకటించిన ఫలితాలలో స్థానిక బ్రౌన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచి బంగారు పతకాలను సాధించారు. బంగారు పతకాలను సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్, వైస్‌చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి అభినందించారు. 2018 విద్యాసంవత్సరంలో యం-ఫార్మసీలో వేముల సింధు, 2019 విద్యాసంవత్సరంలో బీ-ఫార్మసీలో సముద్రాల రచన, 2021 సంవత్సరంలో బీ-ఫార్మసీలో మద్దోజు తేజస్విని, కాటేపల్లి శివానిలు బంగారు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాథ్‌పాత్రో తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉషాకిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఔషధశాస్త్రమునకు సంబంధించిన సమగ్ర పరిజ్ఞానమును విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల పరిపాలనాధికారి సీహెచ్ హనుమంతరావు పాల్గొన్నారు. విద్యార్థులకు బంగారు పతకాలను జులై 7న కాకతీయవిశ్వ విద్యాలయం వారు అందించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

» మధిర కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి ప్రశాంతి



మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రశాంతి

మధిరటౌన్,జూన్12(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మధిర కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్. ప్రశాంతి అన్నారు. గురువారం మధిర కోర్టులో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జరిగిన న్యాయ చైతన్య సదస్సులో ఆమె మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. మధిర కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి మాట్లాడుతూ బాల కార్మికులను పనిలోకి పెట్టుకోవద్దని, ఈ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, వెంకటేశ్వరావు, రమేష్, జనార్ధన్ రావు, జగన్మోహన్‌రావు, పాల్గొన్నారు.

బోనకల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ కొరకు పాటు పడాలి మండల ప్రత్యేకాధికారి కె. విజయభాస్కరరెడ్డి కోరారు. మండలంలోని ఆళ్లపాడు, రావినూతల, బోనకల్ తదితర గ్రామాల్లో గురువారం బాల కార్మిక నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఎం. కరుణ, లాల్ పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ తొలిమెట్టు

» డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి



చిన్నారుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి

కొణిజర్ల, జూన్12(ఆంధ్రజ్యోతి): చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రమే తొలిమెట్టని డీడబ్ల్యూవో రామ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెద్దమునగాలలో అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కమలప్రియ, ఏసీడీపీవో ఉషారాణి, సూపర్‌వైజర్ కె.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్‌లు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం మండల ప్రత్యేక అధికారి సునీత, ఎంపీడీవో చంద్రశేఖర్, సీడీపీవో నిర్మలజ్యోతిలు సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, సుజాత, భవానీ పాల్గొన్నారు.

పోలంపల్లి తండాలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు

కారేపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లితండాలో గురువారం మహిళలు ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాడమాసం సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందని, దానిలో భాగంగానే బోనాలు సమర్పించడం జరిగిందన్నారు.



కుమారుడిపై కేసు

తల్లాడ, జూన్12(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన చల్లా తిరుపతమ్మ ఫిర్యాదుమేరకు కుమారుడు చల్లా అశోక్ అలియాస్ తంబిపై గురువారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కల్వర్టు నిర్మాణానికి అనుమతి

మధిరటౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): మధిర లోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కల్వర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చినట్లు అదనపు కలెక్టర్, మధిర మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ శ్రీజ తెలిపారు. గురువారం ఆమె రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించి కల్వర్టు నిర్మాణానికి పరిపాలనా పరమైన అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. రైల్వే వారు అండర్ బ్రిడ్జి వద్ద మధిర టూటౌన్ నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు నీరు వన్‌టౌన్ వైపు పోయేందుకు మూడో లైన్ నిర్మాణ సమయంలో చిన్న పైప్‌లు వేయడంతో వర్షం కురిసినప్పుడల్లా మురుగునీరు సక్రమంగా పారక ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు పైప్‌లు తీసివేసి కల్వర్టు నిర్మించాలని డిప్యూటీ సీఎం భట్టి తో పాటు పలువురు అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆమె స్వయంగా వచ్చి పరిశీలించి కల్వర్టు ఆవశ్యకతను గుర్తించి వేంటనే మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డీఈ నరేష్‌రెడ్డి, కమిషనర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బస్సు మోటార్ సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం తాళ్లమడ సమీపంలో జరిగింది. సత్తుపల్లి మండలం రామగోవిందాపురం పంచాయతీ పరిధిలోని కొమరం భీం కాలనీకి చెందిన భూక్యా రాము(45), కాక ఏసుబాబులు మోటార్‌సైకిల్‌పై గురువారం సత్తుపల్లి వైపు నుంచి గంగారం వెళ్తుండగా, మణుగూరు డిపోకు చెందిన ప్రైవేటు (ఆర్టీసీ అద్దె)బస్సు అదే రూటులో వెళుతూ ఓవర్ టేక్ చేసే సమయంలో వాహనానికి తగిలింది. ఈ ప్రమాదంలో రాము బస్సు వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏసుబాబు గాయపడ్డాడు. మృత దేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గుండెపోటుతో పోస్ట్ మాస్టర్....

కారేపల్లి, జూన్12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాథపల్లి పంచాయతీ పోస్ట్ మాస్టర్ తాతా అచ్చారావు(60)గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.